# తిమింగల స్వర్గం

## 3

మేమందరం ఏం చెయ్యలేకపోయినందువలన ఇలా వుండవలసివచ్చిందో, ముందు ముందు ఏం చేస్తే అందరం బావుంటామో చర్చిస్తూ, విశ్లేషిస్తూ పథకాలు రచిస్తూ పాటలు పాడుతూ సముద్రం వొడ్డున కూర్చున్నాం, మిత్రులందరం. ఉన్నట్టుండి పాదాల క్రింద తడి – ఏ పిల్ల కెరటమో పాదాలు తాకి పోతుంది కాబోలనుకున్నాను. అంతలో ఎవరో వీపు మీద కొట్టినట్టయింది. వెనక్కి తిరిగితే ఒక పెద్ద అల. లేచి పరుగెత్తబోయాం అందరం. అల వెనుక అల కమ్మేసింది.

అంతే చెల్లాచెదురైపోయాం. నేను కొట్టుకుపోతున్నాను. ఎక్కడికో! ఇందాకటి వరకు ఎన్ని మాట్లాడాం? ముందుకు పాదం పడని బలహీనత గురించి, ఇమిడిపోలేని ఆత్మగౌరవం గురించి – ఈ ఉప్పెన మనందరినీ ఇలా విడదీసి వెన్నులో పొడిచింది. నేనీ ప్రవాహానికి ఎదురీదలేకుండా వున్నాను. నేను చచ్చిపోవలసిందేనా? నా మిత్రులెవరూ నన్ను కాపాడరా? మిత్రులారా! ఏమైపోయారు మీరు? ఎవరో నన్ను చెయ్యిపట్టి

లాగుతున్నారు. నన్ను రక్షిస్తున్న నా ప్రాణమిత్రులు కావచ్చు. నేను బ్రతుకుతాను. అనుకున్న పన్లన్నీ చేస్తాను. ఎవరో ఎక్కడికో లాగుతున్నారు. నన్ను - నాకేం కనిపించడంలేదు. ఏదో మృత్యుశీతల స్పర్శ. నేను చచ్చిపోతున్నానా ?

కాదు నేను చచ్చిపోలేదు. సమశీతోష్ణపు గదిలో, హంస తూలికా తల్పం మీద తేలేను. గదంతా కృత్రిమమైన పూల మొక్కలతోను, గోడలకి రంగురంగుల బొమ్మలతోను వుంది. నా ముక్కుకు తగిలించిన గొట్టాన్ని బట్టి, గోడమీద 'డాక్టర్' అని వున్న నేమ్‌ప్లేట్‌ని బట్టి అది హాస్పిటల్ అని అర్థమైంది. అమ్మయ్య నేను బ్రతికాను. నా మిత్రులంతా కూడా బ్రతికే వుంటారు. గొట్టంలో నుంచి ఊపిరి పీలుద్దామనుకుంటే ముక్కులోకి గాలికి బదులు ఏవో కాగితాలు వెడుతున్నాయి. అప్పుడు చూశాను - నాకెదురుగా స్టూలు మీద నీలం చారల గౌను వేసుకుని కూర్చుందొకావిడ. ఆవిడ గౌనుకి గుచ్చి వున్న బిళ్ళ మీద ఆమె పేరూ, 'డ్యూటీ నర్స్' అన్న పదం వ్రాసి వున్నాయి. నర్సులు తెల్లడ్రస్సులు వేసుకోవడం ఎరుగుదును కానీ నీలం చారల గౌన్లు వేసుకోవడం చూడలేదు. ఈ హాస్పిటల్ రూల్సేమో. నేను కళ్ళు తెరిచి ట్యూబ్ వంక వింతగా చూడడం గమనించి ఆవిడ లేచి నా మొహం మీదికి వంగింది. విశాలమైన నుదురు - పెద్ద బొట్టు స్టిక్కర్ - ముందు పళ్ళు రెండు కొంచెం ఎత్తు - దయ గల ఆ చిరునవ్వు - అయ్యో ఆవిడెవరో కాదు మా అమ్మే - అదుగో ఆ బిళ్ళ మీద పేరు కూడా మా అమ్మదే. నిక్షేపంలా వెంకటగిరి చీరెలు కట్టే మా అమ్మ ఇలా గౌను వేసిందేమిటి? ఎవరైనా ట్యూబ్‌లో నుంచి ఆక్సిజన్ పంపుతారు గానీ రంగు కాగితాలు పంపుతారా? ఖచ్చితంగా ఇది కలే - అమ్మయ్య నేను సముద్రంలో పడలేదు. ఏ అలా నన్ను మింగలేదు. నన్నెవరూ రక్షించలేదు. ఒక్కసారి తల విదిలించి లేచి కూర్చుంటే మా ఇంట్లో మంచం మీద వుంటాను అనుకుని తల విదల్చబోయాను.

"అలా విదల్చకు. ఆ ట్యూబు ఊడిపోతుంది" అంది నీలంగౌను నర్సు. అమ్మలాంటి నర్సు.

"ఊడనియి. ఇలా నా ఊపిరితిత్తుల గుండా కాగితం ముక్కలు చేరితే నేను చచ్చి పోతాను. మీ హాస్పిటల్ వాళ్ళు నన్ను చంపదలుచుకున్నారా ఏం?" అన్నాను.

"ఓసి పిచ్చిమొహం! అవి కాగితాలు కావే. కరెన్సీ నోట్లు. ఇదిగో ఈ సిలిండర్ నిండా నోట్లున్నాయి. అవ్వన్నీ నీ ఊపిరితిత్తుల్లోకి పంపిస్తాం. మా ట్రీట్‌మెంటంతా నీకు దీర్ఘకాలం లాభించేలా వుంటుంది. ఇక నువ్వెప్పుడూ ఊపిరాడక బాధపడవు. జీవితాంతం హాయిగా ఊపిరి పీలుస్తావు" అందావిడ.

"ఏడ్చినట్టుంది. కానీ ముందు నన్ను ఈ కలలో నుంచి మేలుకొని మా ఇంటికి పోనీ" అని లేవబోయాను.

ఈసారి ఆవిడ నావంక ఎగతాళిగా చూసింది. ఎగతాళిగాకేవిటిమరి - నా చేతులు, కాళ్ళూ మంచానికి బెల్టుతో కట్టిపడేసి వున్నాయి.

"నువ్వు మా అమ్మలా వున్నావు నర్సమ్మా. ప్లీజ్ నా కట్లు విప్పు. నేను కలలోంచి వెళ్ళిపోతాను" అని కొంచెం ఆవిడని బ్రతిమిలాడేను.

"అమ్మలా వుండడం ఏమిటీ? నేను మీ అమ్మనే. చాలా పెద్ద ఆపదలోంచి బయట పడ్డావు. సమయానికి మీ నాన్నే నిన్ను కాపాడుకున్నారు. ఈరోజుకి మాట్లాడక విశ్రాంతి తీసుకో" అంది అమ్మ నర్సు.

"నువ్వు నర్సువెప్పుడయ్యావు. పొద్దున కూడా ఇంట్లోనే వున్నావే! నేను సముద్రంలో పడిపోయానని మీకెలా తెలుసు? నాన్న నన్నెలా కాపాడారు! అంతా ఆశ్చర్యంగా వుంది!"

"ఇప్పుడిలాంటి ప్రశ్నలడగకు. హాయిగా విశ్రాంతి తీసుకో! తరువాత తీరికగా మాట్లాడదాం" అంది నర్సు అమ్మ.

కలయో ! నిజమో ! కానరావడం లేదు. నాకు కలలు తరచూ వస్తుంటాయి. అందులోను సల్మాన్ రష్దీ టైపు కలలు. మెలుకువ వచ్చాక ఆ కలలు నవ్వుల అలలై అలరిస్తాయి. ఇప్పుడెంతకీ మెలకువ రాదేం?"

"డాక్టర్ గారొస్తున్నారు" అంది నీలంగౌను అమ్మ నర్సు. నల్లటి డ్రెస్ వేసుకున్న డాక్టర్ గారొచ్చారు. అచ్చు నాన్నలా వున్నాడు.

"ఎలా వుంది అమ్మాయికి?" అనడిగేరు.

డాక్టర్లు నల్ల డ్రెస్‌లు వెయ్యడం ఏమిటో!

నీలంగౌను వేసుకుని మా అమ్మ పేరు తగిలించుకుని, మా అమ్మనేనని చెబుతున్నావిడ, డాక్టర్ వెనకాలే గుమ్మం దాకా వెళ్ళి ఆయన చెవిలో గుసగుసలాడింది.

కొన్ని మాటలు అస్పష్టంగా వినపడ్డాయి. ఏమిటో, మెదడూ, గుండె అంటున్నారు.

అంతలో మరో ఆకుపచ్చ డ్రస్ వేసుకున్న డాక్టర్ వచ్చాడు. ఆ మొహమూ పరిచయం వున్నట్టే అనిపించింది. నా ఎక్స్‌రేలు తదితర రిపోర్టులు పరిశీలించాడు. తరువాత నల్లడ్రెస్ డాక్టరుతో మంతనాలాడాడు.

"రేపే ఆపరేషన్" అన్నాడు నల్లదుస్తుల వైద్యుడు.

"నాకెందుకు ఆపరేషన్" అన్నాను కంగారుగా.

"ఇక్కడ నువ్వు ప్రశ్నలడగకూడదు. కళ్ళు - నోరు మూసుకుని పడుకో" అంది అమ్మ నర్సు.

నాకేం జబ్బు చేసిందో నాకు చెప్పకుండా ఆపరేషన్ చెయ్యడం ఏం న్యాయం? నా మెదడుకేం దెబ్బ తగల్లేదు. గుండె బాగానే కొట్టుకుంటోంది. వీళ్ళేదో గుండె మార్పిడి గురించి, మెదడు మార్పిడి గురించి గుసగుసలాడారు. అవేమైనా మాసిన దుప్పట్లా మార్చడానికి?

ఈవిడ నాకు అమ్మ అయితే ఇలా ప్రవర్తిస్తుందా?

ఇది కలా? కల అయితే ఇంత సుదర్ఘీమైన కలా?

ఇంకా తెల్లవారదేమిటి? నీరసంగా వుంది. నిద్రొస్తున్నట్టుంది.

మెలకువ వచ్చేసరికి నేను ఆ గదిలో ఆ మంచం మీద లేను. ఆపరేషన్ టేబుల్ మీద వున్నాను. నా చుట్టు నలుగురు డాక్టర్లు, నలుగురు నర్సులు వున్నారు.

"రెండు ఆపరేషన్లు ఒకేసారి. ఇద్దరు బ్రెయిన్ మార్పిడి, ఇద్దరు గుండె మార్పిడి" అన్నాడు నల్లడ్రెస్ నాన్నలాంటి డాక్టరు. ఆ మొహం అచ్చు నాన్నదిలాగే వుంది సుమా! నాన్నేనేమో!

వీళ్ళు నా శరీరాన్ని పనసకాయ తరిగి తొనలు వొలిచినట్టు వొలిచి పారేస్తారన్నమాట.

"ఈ బ్రెయిన్ శాం మామయ్యగారి దేశం నుంచి తెప్పించాం. చాలా సమర్థవంతంగా పనిచేస్తుంది" అన్నాడు పచ్చడ్రెస్ డాక్టర్.

"నువ్వు రిలాక్స్‌డ్‌గా పడుకో. నీకేం ఫరవాలేదు. నెప్పి లేకుండా చేస్తాం. నీకన్నీ తెలుస్తూ వుంటాయి. కావాలంటే నీ మంచం ఎదురుగా గోడకి అమర్చిన టి.వి. స్క్రీన్ మీదకి చూస్తుండు. మేం చేసేదంతా నీకు కనబడుతుంది" అన్నాడు వయొలెట్ రంగు డ్రెస్ వేసిన డాక్టర్.

ఈ డాక్టర్లంతా ఎవరెవరో కాదని గుర్తు పట్టాను. వయొలెట్ డ్రెస్సాయన సాక్షాత్తు మా మూర్ఖుడు మామయ్య. అరె అదుగో అక్కడ కత్తులు, కత్తెర్లు అమరుస్తోందే ఆవిడ మా హిస్టీరియా అత్తయ్య - అంటే మూర్ఖుడు మామయ్య సొంత భార్య. బచ్చలిపండు రంగు గౌను వేసుకుని హడావిడి పడుతున్నావిడ మా పిన్ని. గులాబి ఏప్రన్ వేసుకున్న డాక్టర్ మా పెదనాన్న. ఏమిటో వీళ్ళంతా కలిసి నా గుండెలోనూ, మెదడులోనూ కత్తులు దించి వుంచేస్తారేమో!

"నీకేం భయం లేదులే! అన్ని విషయాల్లో మీ నాన్న చాలా కాల్కులేటివ్" అంది మా పిన్ని శ్లేషతో కూడిన చతురోక్తి విసురుతూ -

"ఈ గుండె - ఈ మెదడు అన్నీ ఇంపోర్టెడ్‌వి. చాలా సమర్థవంతంగా పనిచేస్తాయి. గుండె చాలా దృఢమైనది. అయినదానికీ, కానిదానికీ చలించదు. మెదడు చురుకుగా పని చేస్తుంది" అన్నాడు నల్లడ్రెస్ వేసుకున్న డాక్టర్ నాన్న. ఆయనిక్కడ చీఫ్ సర్జన్. మా ఇంట్లోనూ చీఫే -

అన్ని నిర్ణయాలు తీసుకునే చీఫ్.

టెలిఫోన్‌లు తనే ఎత్తడం, ఎవరికేం కావాలో తనే చూడడం - అమ్మ వండే కూరల దగ్గర్నుంచీ తనే నిర్ణయించడం - ఇలా చేసేవాడు. ఈయన డాక్టర్ కావడం ఏమిటో! అదుగో! నా మెదడు చెత్తబుట్టలోకి వెళ్ళిపోయింది. కొత్తది అమర్చబడింది. ఇదిగో గుండె! అదీ అక్కడకే చేరింది. "ఆపరేషన్ సక్సెస్" అన్నాడు మూర్ఖుడు మామయ్య. అందరూ కలిసి ముసిముసిగా, విజయగర్వంతో నవ్వుకున్నారు. నన్ను తీసుకువెళ్ళి మంచం మీద పడుకోబెట్టేరు.

"ఇక్కడ ఆనవాయితీ ప్రకారం హాస్పిటల్‌లో నాలుగు రోజులుంచుతాం. ఈ నాలుగు రోజులూ డ్యూటీ నర్సు పేషంట్‌కి నాలుగు కథలు చదివి వినిపిస్తుంది. పేషంట్ ఉత్సాహంగా విని 'ఊ' కొడితే ఆమె శరీరం మనం అమర్చిన అవయవాల్ని స్వీకరించినట్టు లెక్క. ఈ

నాలుగు రోజులూ అబ్జర్వేషన్ తరువాత ఇంటికి వెళ్ళిపోవచ్చు" అన్నాడు నల్లడ్రెస్ డాక్టర్ నాన్న.

ఈసారి నర్సుగా మా అమ్మ రాలేదు. మా సుబ్బలక్ష్మమ్మత్తయ్య వచ్చింది. ఆవిడ చేతిలో ఫాల్‌ఫౌండర్ అనే ఒక గొప్పాయన వ్రాసిన 'ఫాల్స్‌టేల్స్' అనే గొప్ప పుస్తకం వుంది. ఆవిడ దాన్ని భక్తిగా కళ్ళకద్దుకుని చదవడానికి ఉపక్రమించింది. ఈసారి ముక్కుకు బదులుగా ఓ చిన్న గొట్టాన్ని కణత దగ్గర పెట్టి ప్లాస్టర్ వేశారు. అందులో నుంచి ఓ మంత్రం వినబడుతుంది. కొత్త మంత్రం 'ఇమిడిపో' 'ఇమిడిపో' అంటూ మెదడులోకి ధ్వనుల్ని పంపుతోంది.

అంతలోనే తలుపు గభాలున తెరుచుకుని ఓ యువతీ మరో యువకుడు గదిలో ప్రవేశించారు. వాళ్ళు చాలా కంగారుగా వున్నారు. గబగబ నా దగ్గరకొచ్చి "అయ్యో విశాలా ఆపరేషన్ అయిపోయిందా నీకు. ఎంత దారుణం" అన్నారు.

"ఎందుకు దారుణం?" అన్నాను నేను.

"నీది చాలా గొప్ప మెదడు. ఎందుకు తీసేయించుకున్నావే" అని ఏడ్చేసింది ఆ అమ్మాయి.

"అసలు నువ్వెవరూ? నా సంగతి నీకెందుకు? ఎందుకు ఏడుస్తావు?" అన్నాను చిరాకు పడుతూ.

ఏమాత్రం బాధ లేకుండా సుతిమెత్తగా జరిగిపోయిన ఆపరేషన్ అయినాకా ఎందుకో చాలా చిరాగ్గా వుంది. బహుశా కొత్త మెదడు ఇమిడేదాకా అంతేనేమో?

"ఆ పిల్లని కంగారు పెట్టక వెళ్ళి విజిటర్స్ రూంలో కూర్చోండి" అని వాళ్ళని బయటకు గెంటింది అత్తయ్య.

"ఎవరత్తయ్యా వీళ్ళు?"

"ఎవరోలే ఎక్స్, వైలు నీకెందుకు. ముందు మనం కథాపఠనం మొదలెడతాం. నీక్కూడా ఉల్లాసంగా వుంటుంది" అంది.

"ఈ నాలుగు కథలూ, నాలుగు అమృత గుళికలనుకో. మొదటిదేమిటంటే ప్రతివాడికీ సొంత ఆస్తి, సొంత కుటుంబం వుండడం ఎంత అవసరమో చెప్పేది. అవ్వి అక్కర్లేదని వాదించేవాడికి పట్టిన దరిద్రమూ, అనుభవించిన కష్టాలూ చిత్రించేది. రెండవదేమో మతాలు, శాఖలు, ఉపకులాలు అన్నీ వున్నాయి. ఎక్కువ తక్కువలున్నాయి. అవి కాపాడుకోవలసిన అవసరాన్ని నొక్కి చెప్పే కథ. ఈ సిద్ధాంతాన్ని ధిక్కరించి నరకానికి వెళ్ళి యమధర్మరాజు చేత వెయ్యి కొరడా దెబ్బలు తిని నూనెలో వేయించబడ్డ వాడి కథ. మూడవది ఈ పోటీ ప్రపంచంలో ఎలా పైకి రావాలి అంటే మన సర్వశక్తులూ మన మీదే కేంద్రీకరించుకుని భుజబలంతో కానీ మేధాబలంతో గానీ వక్రయుక్తులతో గానీ ఏదో విధంగా నిచ్చెన ఎక్కినవాడిని ప్రపంచం ఎలా గౌరవిస్తుందో చెప్పే కథ. తిరగబడి నీతులు వల్లించడానికే కాక ఆచరణలో పెట్టి తీరతానని మొండికేసిన వాడిని సమాజం శిలువ ఎక్కించిన కథ. నాలుగో కథ మనందరం

ఆడవాళ్ళం కదా! ఆడవాళ్ళు ఆడవాళ్ళలా వుండకుండా మగవాళ్ళతో సమానం అని పిచ్చి వేషాలు వేస్తే ఎలా అణచివెయ్యబడతారో, నోరు మూయించబడతారో చెప్పే నీతికథ. ఈ కథలన్నీ అందరికీ చదివి వినిపించి ప్రచారం చేసినందుకు రాజుగారు నాకు కొంత డబ్బి స్తారమ్మా" అంది అత్తయ్య.

నేను మౌనంగా వింటున్నాను.

'ధ్యాస పెట్టి విను - ధ్యాస పెట్టి విను' అంది నా కొత్త మెదడు.

అత్తయ్య మొదటి కథ మొదలుపెట్టింది. ఉదాహరణలతో అలంకారాలతో అద్భుతంగా వ్రాశాడు ఫాల్ ఫైండర్ ఆ కథని.

'చాలా బావుంది సూపర్బ్' అంది నా మెదడు.

"చాలా బావుంది. సూపర్బ్" అన్నాను నేను వెంటనే.

"ఇవ్వాళ్టికి చాలు. నువ్వు విశ్రాంతి తీసుకో. నేను కూడా ఒక కునుకు తీస్తాను" అని 'ఫాల్స్ టేల్స్' గ్రంథరాజాన్ని ఒకసారి కళ్ళ కద్దుకుని పడకకుర్చీలో వాలింది సుబ్బలక్ష్మమ్మ నర్సత్తయ్య.

ఆవిడలా పడుకోగానే ఇందాకటి వాళ్ళిద్దరూ సుడిగాలిలా తలుపు నెట్టుకుని వచ్చారు.

"విశాలా! నన్ను గుర్తుపట్టలేదా? నేను కాంతిని. ఇతను రవి. మనందరం మిత్రులం. కరుణ, దయా, ప్రేమ, చంద్రా, వెన్నెల, స్ఫూర్తీ అందరం ఆరోజు సముద్రం వడ్డున కూర్చుని ఎన్ని కబుర్లు చెప్పుకున్నాం" రొప్పుతూ చెప్పింది కాంతి అనే అమ్మాయి.

"అంతా అయిపోయింది" అన్నాడు రవి.

"నేనూ, రవీ చెయ్యి వదలకుండా ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాం. ఇంతలో ఏదో బలవంతమైన చెయ్యి మమ్మల్ని తనలోకి లాగేసింది. మేం కూడా నీలాగే ఇక్కడ తేలాం. అసలీ లోకమేమిటో నీకు తెలుసా?" అంది కాంతి కోపంగా.

"తెలియదు"

"ఇదొక పెద్ద తిమింగలం. చాలాకాలం క్రితం ఇది కొంతమందిని మింగేసింది. వాళ్ళంతా దానికడుపులో స్థిరపడిపోయి ఇక్కడొక లోకాన్ని తయారుచేశారు. రకరకాల సుఖాలని సృష్టించుకున్నారు. శాంమామయ్య లాంటివాళ్ళు - తరువాత వీళ్ళు వీళ్ళ యుక్తులతో, శక్తులతో ఎవరు తిమింగలం సమీపానికొస్తే వాళ్ళనల్లా లోపలికి లాగేస్తున్నారు. లాగేసి వాళ్ళ మెదళ్ళని, హృదయాలనీ తీసిపడేసి తాము కండిషన్ చేసి వుంచిన మెదడు, గుండెలనీ అమరుస్తున్నారు. అవి అమరిస్తే ఇక వాళ్ళకి ఎదురు చెప్పడం వుండదు. ప్రోగ్రామింగ్ చేసిపెట్టిన కంప్యూటర్‌లా నీ మెదడు నీకు ఆజ్ఞలు జారీ చేస్తుంది"

'డోన్ట్ టాక్ రబ్బిష్ అను' అంది నా మెదడు.

"డోన్ట్ టాక్ రబ్బిష్" అన్నాను.

"ఇదంతా నల్లని లోకం. చీకటి లోకం. సూర్యుడు లేడు, చంద్రుడు లేడు, వెలుగు లేదు, వెన్నెల లేదు, ఎవడిల్లే వాడి లోకం" రవి అరిచి చెప్పాడు.

అంతలో ఇద్దరు పోలీసులొచ్చారు. వాళ్ళని లాక్కుపోయారు.

'పీడ వదిలింది ఇంక నిద్రపో' అంది మెదడు.

నాలుగు రోజుల కథాపఠనం అనంతరం నా అవయవాలు నా శరీరానికి అమిరి పోయాయని డాక్టర్లు నిర్ధారించిన అనంతరం నన్ను డిశ్చార్జి చేశారు. ఆరోజు నేను కారు ఎక్కుతుండగా మళ్ళీ కాంతి, రవీ వచ్చారు.

"మన స్నేహితులంతా ఎక్కడికి కొట్టుకుపోయారో తెలీదు. ప్రేమ కనబడడం లేదు. దయ మాయమైపోయింది. నీకేమో ఆపరేషన్ అయిపోయింది. మేం ఇద్దరం ఎలాగైనా ఇక్కడి నుంచి పారిపోతాం" అని కారే కన్నీళ్ళతో నా చెంప మీద ఒక ముద్దు పెట్టింది కాంతి.

'నీ గుండె చలించదు - నీ గుండె చలించదు' అంది నా మెదడు. నా గుండె చలించలేదు.

నన్ను ఇంటికి తీసుకెళ్ళడానికి వచ్చిన మా అమ్మ ఈసారి పట్టుచీరె కట్టుకుని వచ్చింది.

"పిచ్చి సన్నాసులు. మళ్ళీ వెనక్కి వెళ్ళాలనే. ప్రవాహంలో పడి కొట్టుకుపోతే శవాలై తేలతారు. ఇక్కడుంటే హాయిగా సుఖంగా బ్రతకవచ్చుగదా!" అంది.

'పిచ్చి సన్నాసులు కారు పొగరుబోతులు' అంది నా మెదడు.

"ఆంటీ ! నీకింకా పాతరోజులు గుర్తున్నాయా?" అంది కాంతి.

"ఎందుకు గుర్తు లేవమ్మా వున్నాయి. నేను ఆపరేషన్ చేయించుకోలేదు" అంది మా అమ్మ.

"ఎందుచేతనో?"

"నాకు ఆపరేషన్ అవసరం లేకుండానే నా మెదడు ట్యూన్ అయిపోయింది. మేం మీకన్నా చాలా ముందొచ్చాం కదా! పరిస్థితులర్థం చేసుకుని నడుస్తున్నాం. కాలానికి ఎదురీదడం ప్రాజ్ఞుల లక్షణం కాదు కదా!" అంది మా అమ్మ.

"మేం మాత్రం ఇక్కడి నుంచి బయటపడాలి. మమ్మల్ని రక్షించు ఆంటీ. ఒక నాలుగు రోజులు మీ ఇంట్లో ఆశ్రయం ఇవ్వు. ఈ నాలుగు రోజుల్లో ఏదో ఒక ప్లాన్ చేసి పారిపోతాం" అన్నది కాంతి.

"ఆవిడనే బ్రతిమిలాడు. ఆవిడది ఒరిజినల్ గుండె. కాస్త కరుగుతుంది" అన్నాడు రవి.

"సరే పదండి" అన్నది అమ్మ.

"ఈ పీడ మన ఇంట్లో ఎందుకు? ఈ పీడ మన ఇంట్లో ఎందుకు? రావద్దను రావద్దు అను' అంది నా మెదడు.

"ఈ పీడ మనింట్లో ఎందుకు. ఈ పీడ మనింట్లో ఎందుకు. రావద్దు రావద్దు" అన్నాను.

అమ్మ నవ్వి "పదండి" అంది. వాళ్ళూ కారెక్కారు.

మా ఇల్లు బావుంది. మా ఇల్లు బావుంది.

మా ఇంట్లో అన్ని సామాన్లు వున్నాయి. అన్ని సామాన్లు వున్నాయి. మా నాన్న నల్లడ్రెస్ వేసి సంపాదిస్తే ఏం? అన్నీ సమకూర్చేడు. గుడ్ డాడీ.

"ఈ కిటికీ తెరవనా ఆంటీ" అన్నాడు రవి.

"అది కిటికీ కాదోయ్. కిటికీ డిజైన్. సరదా కోసం వేయించాం. ఇక్కడ కిటికీల్లో నుంచి నీకేం కనబడదు. కావాలంటే పది లైట్లు ఇరవై ఫాన్లు వేసుకో. అయినా ఇదంతా ఎయిర్ కండిషన్డ్"

"ఎయిరేమిటి? ఎవ్విరిథింగ్ ఈజ్ కండిషన్డ్" అంది కాంతి.

"అతి తెలివి - అతి తెలివి" అంది మెదడు.

"అతి తెలివి, అతి తెలివి" అన్నాను నేను.

అంతలో నాన్న వచ్చేడు. "వీళ్ళనిక్కడికి తెచ్చావా? సరే కానియ్! మనింట్లో వున్న ఈ వందకాళ్ళ ఎలక్ట్రానిక్ పురుగు కుట్టిందంటే వాళ్ళే మత్తుగా పడి వుంటారు. తరువాత ఆపరేషన్‌కి వప్పించడం కష్టం వుండదు" అన్నాడు కాంతినీ, రవినీ క్రీగంటితో చూస్తూ.

అమ్మ వంట చేస్తోంది. ఆవిడ దగ్గర షావుకారు జానకివీ, నలాకపూర్‌వీ వేలాది రెసిపీలున్నాయి. వంట ఇల్లంతా ఓ పచారీ కొట్టులా వుంది. రుబ్బడానికి, తరగడానికి, వండడానికి, రసం పిండడానికి, తురమడానికి, నరికి పోగులు పెట్టడానికి రకరకాల ఆయుధాలున్నాయి.

అమ్మ వాటి మధ్య చాలా శ్రద్ధగా మునిగి తేలుతోంది.

"భోజనానికి రమ్మంటావా?" అన్నాడు నాన్న.

"వుండండి. సాంబారు దించేటప్పుడు ఒక చెంచా కమ్మని నెయ్యి వెయ్యమంది జానకి - ఆ కమ్మని సాంబారు రెడీ" అంది అమ్మ.

భోజనం చేసినంతసేపూ అమ్మ మాట్లాడుతూనే వుంది. నాన్న మాత్రం రవినీ, కాంతినీ గమనిస్తున్నాడు.

ఆయన డ్యూటీకి వెడుతూ, "వాళ్ళకి మనం ఇక్కడ సాధించినదంతా చెప్పు. ఎలాగైనా ఆ పురుగు కుట్టేలా చెయ్యి" అని అమ్మకు బోధించి వెళ్ళాడు.

అమ్మ కార్యక్రమం మొదలుపెట్టింది.

"ఇదిగో ఈ పురుగు వుంది చూశావా? ఒక్కసారి దీని కాలు ముట్టుకో. నీకు బ్రహ్మాండమైన వినోదాన్ని ఇస్తుంది" అంది.

"మాకిదంటే చిరాకు. మీరు దానితో వినోదించండి. మేంవెళ్ళి మాట్లాడుకుంటాం" అని వాళ్ళిద్దరూ అక్కడి నుంచి లేచిపోయారు.

సాయంత్రం మా అమ్మ మా అందరికీ 'ఆకర్షణ' గురించి ఉపన్యాసం ఇచ్చింది. ఈ ప్రపంచంలో 'ఆకర్షించడం' అనేది చాలా ముఖ్యం అట. అందుకోసం మనం చేసే ప్రతి పనీ

ఇతరులని ఆకర్షించేలా చెయ్యడం కోసం మనం ప్రయత్నించాలట. ఈ 'ఆకర్షించడం'లో మొదటిమెట్టు బాహ్యాలంకరణ. ఇది అవుటర్ డెకొరేషన్ అయినా దీన్ని ప్రస్తుతం ఇంటీరియర్ డెకొరేషన్ అని పిలుస్తారట. ఇళ్ళు, ఆఫీసులు, మనుషులు ఆకర్షణీయంగా కనబడకపోతే తప్పట. ఇందుకోసం ఎంతైనా ఖర్చు పెట్టాలిట. ఇది కూడా సౌందర్య దృష్టేనట.

"ఆత్మ సౌందర్యం గురించి ఎప్పుడైనా విన్నారా?" అన్నాడు రవి.

"వినే వుంటాను. ఇప్పుడంత తీరిక ఏదోయ్. ఆత్మ పేరెత్తితే అంకుల్ వూరుకోరు. ఆత్మ శరీరంలో భాగమే కదా! శరీరం గురించి శ్రద్ధ తీసుకుంటే ఆత్మ గురించి తీసుకున్నట్టే" అంది అమ్మ.

"అమ్మాయిగారు దొరికినప్పుడు వారి చేతిలో ఈ సంచి వుందండి" అంటూ ఎవరో ఒక సంచి తెచ్చిచ్చారు.

"అవును మనందరం సముద్రం వొడ్డున రెండు రోజులు గడుపుదామని సంచీలు కూడా తీసుకుని వెళ్ళాం" అంది కాంతి కళ్ళనీళ్ళతో.

ఆ సంచీలో నుంచి తెల్లవీ, ఎర్రవీ రెండు జతల బట్టలు తీసి బయటికి విసిరేస్తూ, "ఈ రంగులు ఇక్కడెవరూ వాడరు. ఒకే రంగులు పదేపదే వాడడం ఫ్యాషన్ కాదు. బోరు కొడుతుంది. తరచూ రంగులు మార్చాలి" అంది అమ్మ.

"ఇవన్నీ నీకెవరు చెప్పారు ఆంటీ!" అంది కాంతి.

"ఎవరు చెప్పడం ఏమిటమ్మా? ఇక్కడ పద్ధతులు ఇవి. చూసి తెలుసుకుని నేర్చుకుంటాం"

"వీళ్ళ పీడ త్వరగా వదిలించుకోమను. వీళ్ళ పీడ త్వరగా వదిలించుకోమను" అంది నా మెదడు.

నేను నోరు తెరవబోతుండగా "నేనన్నవన్నీ నువ్వు పైకి అనకూడదు. నేను నీకు సంకేతం ఇస్తేనే అనాలి. వాళ్ళు వెళ్ళాక మీ అమ్మతో చెప్పు" అని కోప్పడింది నా మెదడు.

మా అమ్మానాన్న యుద్ధ ప్రాతిపదిక మీద నా పర్సనాలిటీ డెవలప్మెంట్ ప్రారంభించారు.

ముక్కుకు ప్లాస్టిక్ సర్జరీ చేయించి రవ్వల పుడక పెట్టారు. మొహానికి రకరకాల పళ్ళ రసాలతో, వివిధ రసాయనాలతో వేలకివేలు ఫేషియల్స్ చేయించారు.

బాస్తో ఎలా మసులుకోవాలో, మొగుడితో ఎలా సర్దుకుపోవాలో, వంటిల్లు ఎలా సర్దుకోవాలో, పడగ్గది ఎలా అలంకరించుకోవాలో - ఒకటేమిటి ఎడాపెడా శిక్షణ ఇచ్చేస్తున్నారు. రకరకాల తినుబండారాలు వండి పెడుతున్నారు. రంగురంగుల రకరకాల దుస్తులు కొనిస్తున్నారు. నా వినోదానికి మా వందకాళ్ళ పురుగు వుండనే వుంది. ఈ కాంతీ, రవి మాత్రం ఆ పురుగుని కనీసం కడగంటితోనైనా చూడరు. మా అమ్మ వండే మత్తు పదార్థాలు రుచి చూడరు.

"ఇంక నిన్ను రికామీ దేశం పంపుతాను" అన్నాడు నాన్న.

"అది యువతీ యువకుల కలల పంట. తల్లిదండ్రుల ఆశయాల పంట" అన్నాడు ఆవేశంగా.

అమ్మ వెంటనే అందుకుని "అక్కడ బిల్లు అనే పెద్దన్నయ్య వుంటాడు. ధులాయ్ నగరంలో, ధవళ గృహంలో" అంది భక్తిగా.

"ఆయన నీకు పెద్దన్నయ్యా?" అన్నాను.

"ఓసి నీ అజ్ఞానం నాశనం అయిపోనూ! అతగాడు ప్రపంచమంతటి మంచి చెడ్డలూ తన భుజాల మీదే వున్నాయనుకుని అందరికీ పెద్దన్నయ్య అయిపోతున్నాడు. మొత్తం ప్రపంచాన్ని కోడిగుడ్డు కార్యాలయం నీడలోకి తేవాలనుకుంటున్నాడు. ఈ తిమింగల స్వర్గాన్ని డిజైన్ చేసింది ఆయన పూర్వీకులు, ఆయనానూ" అంది కాంతి మొహం ఎర్రగా చేసుకుని.

"దాని మాటలు వినకు. దానిదంతా బోడి వ్యంగ్యం. బిల్లన్నయ్య గొప్పవాడు" అంది మేధావతి (తడవకీ మెదడు, మెదడు అంటం బాగా లేదు అందుకని ఈ పేరు పెట్టుకుంటు న్నాను ముద్దుగా).

"బిల్లన్నయ్య గొప్పవాడు, బిల్లన్నయ్య గొప్పవాడు. హీ ఈజ్ గ్రేట్" అన్నాను.

"నేనలా నల్లడ్రెస్సు వేసుకుని కోట్లు గడించడం భావితరాల బాగుకోసం అమ్మా. ఆ ఆపరేషన్లు చేసే కార్యక్రమాన్ని నెత్తిన వేసుకోవడం పెడదారి పడుతున్న యువతరాన్ని రక్షించ డానికి కాదా తల్లీ" అన్నాడు నాన్న గద్గద స్వరంతో.

'మీ నాన్న మంచివాడు, మీ నాన్న మంచివాడు' అంది మేధావతి.

"యూ ఆర్ గ్రేట్ పాపా" అన్నాను.

"ఎంత ప్రయత్నించినా మీరు మాదారికి రావడం లేదు. ఇంక మా ఇంట్లో నుంచి వెళ్ళిపోయి మీ చావు మీరు చావండి. నాకు కష్టాలు తేకండి. మీకు ఆశ్రయం ఇవ్వడం చూస్తే నాకు నోటీసులొస్తాయి" అని కాంతికీ, రవికీ నోటిసిచ్చేశాడు.

"వెడతాం అంకుల్. ఇక్కడుంటే మీ పురుగు మమ్మల్ని ఎప్పుడు కుడుతుందో తెలీదు. మీ భోజనాలు, మీ డ్రెస్సులు, మీ భోగాలు మమ్మల్ని ఏ మత్తులో ముంచుతాయో తెలీదు. ఇది మాకూ క్షేమం గాదు. ఏ నిద్రలోనో మా కాళ్ళు చేతులు కట్టేసి ఆపరేషన్ చేసినా దిక్కులేదు. మేం వెళ్ళొస్తాం" అన్నారు వాళ్ళు.

వెడుతూ కన్నీళ్ళతోనే కాంతి నా బుగ్గ మీద ముద్దు పెట్టింది.

నేను టిష్యూ పేపర్‌తో తుడిచేసుకున్నాను.

ఆఖరికి ఆరోజు రానే వచ్చింది.

రికామీ దేశ పౌరుడిగా స్థిరపడ్డ మన దేశం వాడే అయిన, మన మతం వాడే అయిన, మన కులం వాడే అయిన ఓ పెళ్ళి కొడుకుని పట్టుకోగలిగేడు మా నాన్న.

నున్నగా గడ్డం, మీసం గీసేసుకుని తెల్లగా, మెత్తగా వున్నాడు అతగాడు. ఆధునిక పురుషులకి ఆదర్శ పురుషుడు. మాటిమాటికీ 'ఆహా' 'ఉహూ' అంటున్నాడు.

పెళ్ళి కాగానే నన్ను నా ఇంట్లో దించడానికి అమ్మానాన్న కూడా రికామీ దేశం వచ్చారు. వాళ్ళ ఆశయం సిద్ధించింది. వాళ్ళ జన్మ చరితార్థం అయింది.

అందరం విహారం బయలుదేరాం.

ఆ మాన్యుమెంట్, ఈ మాన్యుమెంట్, ఈ మ్యూజియం, ఆ మ్యూజియం చూశాం. పీజాలు, పాస్టాలు, నూడిల్స్ గట్రా భోం చేశాం.

ఏడు మిలియన్ టన్నుల బాంబులతో, అనేక విషపూరిత రసాయనాలతో ఆరువేల రెండువందల యాభై చదరపు మైళ్ళ భూమిని బీడుచేసి, యాభై ఏడు వేలమందిని చంపి కూడా యుద్ధంలో ఓడిపోయి, యుద్ధంలో మరణించిన తన సైనికులకు, రికామీ ప్రభుత్వం కట్టించిన స్మృతి చిహ్నాలు చూశాం. వాటి మీద పేర్లని తడిమి పూలు చల్లి కన్నీళ్ళు తుడుచుకుంటున్న అమ్మల్నీ, అమ్మమ్మల్నీ చూశాం.

గెరిల్లాల పట్టుదల ముందు తలవంచిన ఆధునిక మారణాయుధాల గాథ –

"అదుగో బిల్లన్నయ్య, బిల్లన్నయ్య" అని జనం తోసుకోవడం మొదలుపెట్టారు. వెంటనే రక్షక భటులొచ్చారు.

ఆరోజు నెందుకో బిల్లన్నయ్య కొండమ్మ వదినా ధవళగృహం దగ్గర జనానికి దర్శనం ఇస్తున్నారట.

మా నాన్న శరీరం రోమాంచితమైంది. మా అమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి. పర్యాటకుల కళ్ళల్లో ఆనందభాష్పాలు చిప్పిల్లేయి. ఎక్కడి వారక్కడ బొమ్మల్లా నిలబడిపోయారు. రక్షక భటులందర్నీ సర్దిపెట్టారు. ఆహా ఏమా కంటికింపైన దృశ్యం. కలియుగ వైకుంఠం అంటే ఇదేనట. మా అమ్మ అంది. కొంతమంది చేతులూపారు. కొంతమంది గాలిలోకి ముద్దులు విసిరారు. పైనుంచి సెంటు వాసన వేస్తున్న ప్లాస్టిక్ పూలవర్షం కురవసాగింది.

'నువ్వు సంతోషం ప్రకటించు. సంతోషం ప్రకటించు' అంది నా మెదడు. సారీ మేధావతీజీ.

"గివ్ హిమ్ ఎ బిగ్ హ్యాండ్"

అమ్మ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోతోంది. నాన్న తన్మయత్వంతో ఊగిపోతున్నాడు.

నేను మోకాలి వరకు వేసుకున్న మేజోళ్ళు తడవడం గమనించి క్రిందికి చూద్దును కదా అప్పటికే అడుగు ఎత్తున నీళ్ళు. పర్యాటకుల ఆనందభాష్పనది.

"ఓ మై బిల్ ! ఇప్పుడేం చెయ్యాలి?"

ఇదిరికామీ దేశమా, మజాకానా? వెంటనే ఎమర్జెన్సీ బోట్ సర్వీసు రంగంలోకి దిగి, మమ్మల్నందరినీ కార్ల వరకు దిగబెట్టడానికొచ్చింది. తన్మయంగా ఊగిపోతున్న మా నాన్న

ఎప్పుడో తూలి ఆనంద భాష్పనదిలో పడ్డాడు కాబోలు ఊరికే కేకలు పెడుతున్నాడు. అమ్మ అరచి గోల పెడుతోంది. రక్షక భటులు వారిద్దర్నీ రక్షించి తెచ్చి నాకు నా కొత్త పెళ్ళికొడుకుకి అప్పజెప్పారు.

మేం మా సరికొత్త హోండా కారులో ఇంటికి బయలుదేరాం.

"పాపం కాంతీ, రవి ఏమైపోయారో" అంది అమ్మ వెనుక సీట్లో నుంచి వున్నట్టుండి.

మా నాన్న ఇంకా తన్మయత్వం నుండి తేరుకోలేదు కాబోలు "ఏమిటంటు న్నావు?" అన్నాడు.

"ఏం లేదండీ. ఆ పిచ్చి సన్నాసులు రవీ, కాంతీ ఏమైపోయారోనని బాధగా వుంది" అంది ఆవిడ.

"అసలు ముందు నీకు ఆపరేషన్ చెయ్యకపోవడం నాది తప్పు. అక్కర్లేకుండానే నీ మెదడు, గుండె ట్యూన్ అయిపోయాయని చెప్పి మోసం చేశావు. వాళ్ళ గురించి ఇంక మాట్లాడకు. వాళ్ళీప్పడా తిమింగలం నోట్లో నుంచి బయటపడి సముద్రంలో కొట్టుకుపోయి చచ్చిపోయి వుంటారు. లేదా ఏ పోలీసులో పట్టుకుంటే మత్తిచ్చి కాళ్ళు, చేతులు కట్టేసి ఆపరేషన్ చేయించి వుంటారు. వాళ్ళ అదృష్టం బాగుంటే"

"హు ఆర్ దోజ్ గైస్" అన్నాడు కొ.పె.కొ.

"రవీ, కాంతి అని పెక్యూలియర్ గైస్. మా ఇంట్లో కొన్నాళ్ళు వుండి వెళ్ళారు" అన్నాను.

"వాళ్ళు పట్టుదలగల మనుషులు. ఎన్ని బాధలకోర్చి అయినా ఇక్కడి నుంచి తప్పించు కుని వచ్చిన చోటికి చేరుతారు. నా అంతరాత్మ చెబుతోంది" అంది స్వగతంలోలాగ అమ్మ.

"ఆత్మల్ని గురించి మాట్లాడొద్దని లక్షసార్లు చెప్పాను. ఈసారి ఆ పిల్లల గురించి ఎత్తావంటే నీక్కూడా ఆపరేషన్ చేసి పారేస్తాను" అని గదిమాడు నాన్న.

అమ్మ క్షమాపణ చెప్పి కారు కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చుంది.

కొ.పె.కొ విలాసంగా కారు నడుపుతున్నాడు.

"హీ ఈజ్ ఆన్ టాప్ ఆఫ్ ది వరల్డ్. ఎ స్మార్ట్ గై - ఈజ్‌నట్ హీ ? యా! ష్యూర్ - హి ఈజ్"

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 20-12-1996*